# వరాలగని * * *

★

రచన :
కె. వి. వి. యల్. నరసింహారావ్

“నాకెవరికైనా ఏమైనా కోరికలుంటే ఏక బిగిని చెప్పెయండి. అవన్నీ తీర్చేస్తాను. అసలు నేను యిక్కడికి మీకోర్కెలు తీర్చటానికే ట్రాన్స్‌ఫర్‌చేయించుకున్నాను. అసలు నే నెవర్నో తెలుసా? మీ వలసగ్రామాన్ని ఉద్ధరించేందుకే అవతరించిన సాక్షాత్తు శ్రీరామచంద్రమూర్తుల వారి నని నమ్మండి. కాబట్టి మీ కోర్కెలు ఏమున్నా చెప్పెయండి. ఈ రాష్ట్రం నిండా మావాళ్లే. మా మేనమామ సెక్రటేరియటులో సెక్షనుహెడ్డు. మాపినతండ్రి బావమరది తమ్ముడు ఓ M. L. A. నాకు వేలు విడచిన మేనమామ గారి భార్యావంక దూరచుట్టం ఓ డిస్ట్రిక్టుకలక్టరు. యింత మంది మనచేతిలో ఉంటూంటే మీకోర్కెలు తీరటానికి యింకా సందేహముందా? కనుక చెప్పెయండి” అని గుక్క త్రిప్పుకోకుండా మావలసకి క్రొత్తగా (అసలు పాతపిల్లిలెండి) ట్రాన్స్‌ఫరయి వచ్చిన త్యాగరాజు ఓ ఆఫర్ యిచ్చేడు.

యిదంతా వింటూంటే నాలో స్వప్నస్ఖలనంలాగ తఫీమని ఓకోర్కె బయల్దేరింది. వెధవది! మనం వెలిగిస్తున్నది ఓ చిన్న, ఎందుకూ పనికిరాని గుమస్తాగిరి. యింట్లో చూస్తే ఒక వేగను సంసారం. యిది, ఆ ప్రభుత్వంవారు అప్యాయంతో కడిగి చేతినిపెడుతూన్న ఆ అరవైమీద ఏడుతో, యీదుకుంటూ వచ్చేసరికి 19 వ శతాబ్దంలో చచ్చిపోయిన మాతాత ముత్తాతలు కనబడి పలకరిస్తూన్నారు. ఎప్పటికైనా ఈ గుక్కెడు ప్రాణానికి సుఖం వుండొద్దా అని ఓ దుర్బుద్ధి పుట్టింది. మహానుభావుడు మనవి లేకుండానే మనల్ని ముంచేసే వరాలు గుప్పేస్తూంటే, సాష్టాంగంపడి, పాదాలమీద ఓనారికేళం చితక్కొట్టి, అధమం రెండు పులిబుర్రల జీతంమీద ఓచింకి ఉద్యోగం ప్రసాదించమని అడుగుదామని ఉద్దేశం కల్గింది. చేతులు జోడించి నిల్చున్నాను. యింతలోకి శ్రీవారి కన్ను నాప్రక్కనేఉన్న ఓ పోలీసుద్యోగి మీద పడింది. ఆయన కేవలం పోలీసాయన అనడానికి వీల్లేదు. పోలీసులు దొంగతనాలు బనాయిస్తే, ఈయన సోమపానంచేసే సోమయాజుల్ని పట్టుకుంటారు (Prohibition). ఈయనగురించి వివరంగా తెలియజేయాలంటే ఓ సవాలక్ష గ్రంథమవుతుంది. కాని అది అంతా అప్రస్తుతం. ఆలస్యం అయితే వరాలరాజు మాయమవుతాడేమో! అన్నట్లు ఏం చెప్పేనూ? ఆ పోలీసు ఆయనమీద శ్రీవారికన్ను వాలిందనికదూ! “ఏమయ్యా! సీతాపతీ, యింతమంది మనచేతిలో ఉన్నారు. నీకేమైనా ప్రామోషను కావలిస్తే నాతో చెప్పెయ్! చెప్పిన మూడోనాటికి ఆర్డరిచ్చే ఏర్పాటుచేస్తాను. ఇందులో నా స్వార్థం ఏమీ లేదు. అంతా ప్రజోపయోగంకోసమే నేను నా యావత్తూ ధారపోస్తున్నాను, పోస్తాను. మీ బ్రదర్‌తో నాకు జోస్తీ జాస్తీ. కనుక యిందులో నీవేమీ మొగమాట పడ నక్కర్లేదు. ప్రస్తుతం నీ పరిస్థితి చూస్తూంటే నాకు చాలా విచారంగా యుంది. అంచేతనే నీకు ప్రమోషను మీద ప్రమోషను యిచ్చేసి ఓ పెద్దవాణ్ణిగా చేసేదామని ఉంది. యిదంతా నా స్వార్థం అనుకోగలవ్! అంతా ప్రజోపయోగంకోసమే! యీబుద్ధి నాకొక్కడికే కాదు. మాయింట్లో అందరికీ ఉంది. కనుక చెప్పెయ్” అని ఆ వరాలమూట ప్రశ్నించింది. కాని సీతాపతిగార్కి మాత్రం కంచుకాగడాలతో వెతికినా కోర్కెలు లేవు. అంచేత యిలా అన్నాడు: “నాకేమి కోర్కెలు లేవు. నా జీవితం యిట్లా పోనీండి. కాని మిగతావారికిమాత్రం వరాలు ప్రసాదించండి” అని రికమెండు కూడా చేసేడు.

ఆశ్చర్యము! అద్భుతము! నా వరాలపంట! నా అవతారమూర్తి! నాప్రక్క తిరిగి కనుబొమలెగరేసింది. అహో! ఏమి నా భాగ్యము!! మళ్లీ చేతులు జోడించి నిల్చుని “మహాభాగా! ఆది మధ్యాంత రహితా! దేశసేవకా, కరుణాలయ, సాక్షాత్తు నాబోటి గుమస్తాల జీవితోద్ధారకా! యింకా ఏమిటి చెప్మా, ఆఁ అన్నట్టు పాహిమాం! పాహిమాం!” అని కళ్లు మూసుకొని దండంపెట్టి “హేరాజన్, మాబోటి గుమస్తాల జీవితాలు ఉద్ధరించేందుకు మీరు కేవలం God sent అని ఈ పామరుండు, అల్పుడు మనవిచేస్తూన్నాడు. I mean my lord, please kindly excuse me! ఎంచేతంటే మీరే పరమాత్ములవారని సెలవిచ్చేరు. అంచేత క్షమించండి. ప్రభువులు వరాలు యివ్వటమే అపురూపం! కోర్కెలు లేని మానవుడంటూ ఉంటాడా అని నా సందేహం. యిందులో జరిగేది ఒక్క యిచ్చిపుచ్చుకోడం తప్ప యింకోటి కాదు కదా? ప్రస్తుతం నా పరిస్థితి మనవిచేస్తాను, చిత్తగించండి. కావలిస్తే అంతా దివ్యదృష్టిని పరిశీలించే వరం యిప్పించవచ్చు. నాకు యింట్లో గంపెడు సంసారం ఉంది స్వామీ! నాకు యిచ్చేది నలభై అయిదు + యిరవై రెండు. యిందులో మా యింటాయనకి ఓ పది రూపాయలు ముడుపుక్రింద పోతే అక్కడికి మిగిలేది, ఏభైఏడు. ఎందుకీ ఊకదంపు అనుకోగలరు! యిదంతా నా Detailed life. యిల్లుగడవటం కష్టంగా ఉంది. అందువలన ఏలినవారు కనికరించి, నా మొరాలించి, నను గన్నతండ్రీ, ఓ రెండు వందల జీతంతో ఓ బంట్రోతు ఉద్యోగమైనాసరె, నాకు హోదా [illegible]ర్లేదు స్వామీ! Wanted coppers only యిప్పించగలందులకు వినయపూర్వకంగా ప్రార్థిస్తూ ప్రభువులానతిపైని యింతటితో విరమిస్తున్నాను.” అని వరంకోసం కాచుకు నిల్చున్నాను. శ్రీవారు పెదవివిరచేరు. గుండె గతుక్కుమంది, వరం యివ్వరేమో అని. “ఏం స్వామీ?” అన్నాను. “ప్రస్తుతం అప్పర్ డివిజన్‌కే స్టార్టింగు ఎనభై లేదు. హె, హె, హె! నువ్వు అడిగింది చాలా పెద్ద మొత్తం. యింతగా ప్రాధేయపడుతున్నావు కాబట్టి ప్రయత్నించేస్తాను. యీ నెలాఖరుకి మాజాతివారు అయిన ఓ M L. A. వచ్చి యీ ఊళ్లోనే మా బంగాళాలో బసచేస్తాడు. అప్పుడు ఒకమారు కనబడు. నువ్వు అడిగినంత కాకపోయినా కొంతయినా ఏర్పాటుచేస్తాను” అని సెలవిచ్చేరు. ధన్యోస్మి అని చతికిలబడ్డాను.